www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 6 జూన్ 2025




విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం


విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న రమాదేవి

ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పుస్తకపఠనం అలవర్చుకోవడం వలన సమాజంలో జరుగుతున్న వాటిని తెలుసుకొని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని స్థానిక గ్రంథాలయ అధికారి రమాపతి అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా పుస్తక పఠనం అలవర్చుకోవాలని, గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకుంటూ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు, మెమెంటోలను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పర్వీన్ సుల్తాన, దుర్గా, విద్యార్థులు పాల్గొన్నారు.

వామ్మో..జూన్!



- విద్యా సంస్థలకు ఆదాయం
- తల్లిదండ్రులకు వ్యయం
- అరకొర ఆదాయం.. మధ్య తరగతి సతమతం
- అందని ప్రభుత్వ సాయం
- తల్లికి వందనం కోసం ఎదురు చూపులు



ప్రజాశక్తి- పులివెందుల టౌన్

ఏడాదిలో జూన్ మాసానికి ప్రత్యేక ఉంది. జూన్ మాసం వచ్చిందంటే సామాన్య, మధ్యతరగతి కుటుంబాల వారికి పిల్లల చదువులు, వారి ఫీజులు వంటి అంశాలు కళ్ల ముందు కనిపిస్తుంటాయి. వీటి నుంచి ఎలా బయటపడాలనే ఆలోచనతో సతమతమవుతుంటారు. అదే విద్యాసంస్థల యజమానులకు జూన్ మాసం అంటే మహా ఆనందం. ఎందుకంటే విద్యార్థుల నుంచి ఫీజు వసూలు మొదలుకొని పుస్తకాలు, యూనిఫామ్ ఆ ఫీజు, ఇ ఫీజు అంటూ వేలకు వేలు రూపాయలు వసూలు చేసుకునే ఛాన్స్ ఉంటుంది. దీంతో జూన్ మాసం అంటే విద్యాసంస్థల యాజమాన్యానికి ఆదాయం, విద్యార్థుల తల్లిదండ్రులకు వ్యయం గాను భావించవచ్చు. ఇటీవల కాలంలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా బాగా నిలిచిపోయి ఉన్నారు. ముఖ్యంగా గత ఏడాది తీవ్ర వర్షాభావాల పరిస్థితి కారణంగా పంటలు పండక రైతు, సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బ తింది. ప్రభుత్వపరంగా ఎలాంటి ఆర్థిక ప్రయోజనం ఆయా వర్గాలకు చేకూరిన దాఖలాలు లేవు. రాష్ట్రంలో 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించి, ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం కేవలం వృద్ధులకు ఒంటరి మహిళలకు అదేవిధంగా వికలాంగులు తదితరులకు పెన్షన్ పంపిణీ మినహా ఇతర సంక్షేమ పథకాలు ఏవి కూడా ఇప్పటివరకు అందిస్తున్నట్లు లేదు. ముఖ్యంగా విద్య ఆర్థిక సాయం కోసం తల్లికి వందనం పథకాన్ని మొదటి ఏడాది పూర్తిగా విస్మరించింది. దీంతో సామాన్య, పేద, మధ్యతరగతి కుటుంబాల వారు తమ పిల్లల విద్యాభ్యాసం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది జూన్ ఇప్పటికే ప్రారంభమైంది. సాధారణంగా జూన్‌లో ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు ప్రారంభమవుతాయి. తరగతులు నిర్వహించడం తెలిసిందే. దీనికి ముందే విద్యార్థుల నుంచి అన్ని రకాల ఫీజులను ఆయా విద్యా సంస్థలు ముఖ్యంగా ప్రయివేట్ విద్యాసంస్థలు ముక్కు పిండి మరీ వసూలు చేస్తుంటాయి. ఇందులో భాగంగా ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసం పట్ల ఆందోళన చెందుతూ విద్యార్థుల ఫీజులు ఎలా చెల్లించాలి. వారికి పుస్తకాలు కొనడానికి ఇతర అవసరాలు తీర్చడానికి వేలాది రూపాయలు ఎలా వ్యయం చేయాలనే ఆలోచనతో సతమతమవు తున్నారని భావించవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం పట్ల తగిన ఆసక్తి లేకపోవడం, ప్రయివేట్ విద్యాసంస్థలపై ఆసక్తిని పెంచ కోవడంతో ఫీజులను చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు నానా తంటాలు పడుతుంటారు. సాధారణంగా నర్సరీ నుంచి ఎల్‌కెజి స్థాయిలోనే విద్యార్థుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేసే పనిలో ప్రయివేటు విద్యా సంస్థలు పూర్తిగా నిమగ్నమైనాయి. సాధారణంగా చిన్నపాటి ప్రయివేట్ సంస్థల్లోనే ఎంత లేదన్న నర్సరీ ప్రాథమిక విద్య కోసం రూ.10 వేల వరకు ఫీజులు రూపంలో వసూలు చేస్తున్నారు. ఇక కొద్దిగా గుర్తింపు పొంది పట్టణంలో ప్రయివేటు విద్యాసంస్థలలో లక్షల రూపాయలు డొనేషన్ కింద వసూలు చేస్తున్నారు. ప్రాథమిక స్థాయిలోనే ఇలా ఉంటే ఇక ఆరవ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు ప్రవేశం పొందాలంటే లక్షలు లక్షలు ఫీజులు చెల్లించి ప్రవేశం పొందాల్సి ఉంది.

అందని తల్లికి వందనం

ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన తల్లికి వందనం హామీ ఇప్పటివరకు అందలేదు. గత ఏడాది అలాగే గడిచిపోయింది. ప్రస్తుతం జూన్ నెల 15వ తేదీకల్లా తల్లికి వందనం పథకం కింద ప్రతి విద్యార్థికి రూ. 15 వేలు జమ చేస్తారు. కానీ జూన్ నుంచి విద్యా సంవత్సరం ప్రారంభమై విద్యార్థులు హాజరు శాతం ఆధారంగా జూన్ నెల నుంచి పరిగణలోకి తీసుకుంటారు. అలాంటప్పుడు ఏ ప్రాతిపదికన హాజరు శాతాన్ని పరిగణలోకి తీసుకుని తల్లికి వందనం పథకాన్ని అందజేస్తారనేది ప్రశ్నార్థకంగా ఉంది. గత ఏడాది జూన్ నుంచి మార్చి నెల వరకు పరిగణలోకి తీసుకుని తల్లికి వందనం వర్తింప చేయాలని భావిస్తే ఇంతవరకు అలాంటి సమాచారం ఏది కూడా విద్యాధికారుల దాఖలాలు లేవు. మరి అలాంటప్పుడు ఎలా తల్లికి వందనం అమలు చేస్తారనేది అంతుచిక్కని అంశంగా చెప్పవచ్చు. హాజరు శాతాన్ని పరిగణ లోకి తీసుకోకుండా తల్లికి వందనం కింద నగదును వారి వారి ఖాతాలకు జమ చేస్తేనే పథకాన్ని అమలు చేయడానికి వీలుంటుంది తప్ప, మరో రకంగా వీలు పడదనేది అందరికీ తెలిసిందే. మరి ఇలాంటి పరిస్థితులను తల్లికి వందనం కింద లబ్ధిదారులకు నగదు ఏ విధంగా అందుతుందో వేచి చూడాల్సిందే. ఏదేమైనా జూన్ మాసం విద్యాసంస్థల యాజమాన్యాలకు ఆదాయం గాను సామాన్య పేద మధ్యతరగతి కుటుంబాల తల్లిదండ్రులకు వ్యయంగా ఉంటుందనేది వాస్తవం.

ఆరు కేంద్రాల్లో మెగా డిఎస్‌సి పరీక్ష : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామూరి శ్రీధర్

అన్నమయ్య జిల్లాలోని ఆరు కేంద్రాల్లో మెగా డిఎస్‌సి పరీక్ష నిర్వహణకు సన్నద్ధంగా ఉన్నామని, అభ్యర్థులు ఒకటిన్నర గంట ముందే పరీక్ష హాలుకు చేరుకోవాలని, నిర్ణీత సమయానికి మించి నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతించరని పరీక్షా కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నమయ్య జిల్లాలో ఈనెల 6 నుండి నిర్వహించబోయే మెగా డిఎస్‌సి పరీక్షపై పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం ఆరు సెంటర్లలో ఈనెల 6 నుండి జూన్ 27 వరకు పరీక్షలుంటాయని తెలిపారు. మొత్తం 17851 మంది పరీక్షకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మదనపల్లెలో మూడు కేంద్రాలు, రాజంపేటలో ఒక కేంద్రం, రాయచోటిలో రెండు కేంద్రాలలో నిర్వహిస్తున్నారు. పరీక్ష నిర్వహణకు రెవెన్యూ, పోలీస్, ఎపిఎస్‌ఆర్‌టిసి తదితర శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించామన్నారు. పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో ఉంటుందని, ఉదయం 9:30 గంటల నుండి 12 గంటల వరకు తర్వాత మధ్యాహ్నం 02:30 నుండి 05 గంటల వరకు పరీక్షలుంటాయని పేర్కొన్నారు. కొన్ని రోజులు మూడు సెషన్లలోనూ నిర్వహిస్తారన్నారు. సమావేశంలో డిఇఒ సుబ్రహ్మణ్యం, ఎఇఒలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

జిల్లాలోని ప్రజలందరూ జనాభా నిర్వహణ విధానంలో అభిప్రాయాలను ఇచ్చి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ఈనెల 1 నుండి 20 వరకు ప్రజలు తమ విలువైన అభిప్రాయాన్ని అందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జనాభా నిర్వహణ విధానం పై ప్రణాళికా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభా పెరుగుదల శాతం గత కొన్ని సంవత్సరాల నుండి తగ్గుతూ ఉన్న నేపథ్యంలో జనాభా నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనాభా నిర్వహణ విధానంపై అన్నమయ్య జిల్లా ప్రజలందరూ వారి విలువైన అభిప్రాయాలను అందించి జనాభా నిర్వహణ విధానంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చున్నారు. ప్రత్యామ్నాయంగా https://swarnandhra. ap.gov.in/PMP అనే వెబ్‌సైట్‌లో తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చున్నారు. కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్, డిఎం హెచ్ఒ ఉషశ్రీ, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ అధికారి సురేష్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ పాల్గొన్నారు.

పుస్తకాల పేరుతో వ్యాపారం తగదు : ఎస్‌ఎఫ్‌ఐ


చైతన్య విద్యా సంస్థ ముందు ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

కార్పొరేట్ విద్యా సంస్థల కబంధ హస్తాలలో రాష్ట్ర ప్రభుత్వం చిక్కుకుందని, నారాయణ, శ్రీ చైతన్య విద్యా సంస్థల చేతులలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలుబొమ్మగా మారారని, పుస్తకాల పేరుతో విద్యాసంస్థలు వ్యాపారం చేయడం తగదని ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సర్వేపల్లి నరసింహ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో ఉన్న శ్రీ చైతన్య విద్యా సంస్థల నందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠ్యపుస్తకాలు, కాట్ బుకింగ్ పేరుతో శ్రీచైతన్య విద్యా సంస్థలు వేల రూపాయలు వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ విషయమై ఎంఇఒ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి ఎంఇఒ ప్రభాకర్ రెడ్డిని కలిసి చైతన్య విద్యా సంస్థల దగ్గరికి తీసుకెళ్లామన్నారు. స్థానికంగా తరగతులు నిర్వహిస్తున్నా, అడ్మిషన్లు చేసుకుంటున్నా, పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నా ప్రత్యక్షంగా చూసిన ఎంఇఒ తానేమి చేయలేనని, తమకేమీ తెలియదని చెప్పి వెళ్లిపోవడం దారుణమని చెప్పారు. ఆ స్కూల్ కు సంబంధించిన ఆర్ఐ, ఎఒ లతో ఫోన్లో మాట్లాడుకొని డబ్బులకు లాలుచబడ్డారా, లేక విద్యాసంస్థలకు భయపడ్డారా అన్నది అర్థం కాని పరిస్థితి అన్నారు. ఇలాంటి మండల విద్యాశాఖ అధికారులతో కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి కారణం ఇలాంటి ధికారుల నిర్లక్ష్యమేనని స్పష్టం చేశారు. మదనపల్లె మండలంలో కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థల ఆగడాలు మితిమీరి పోయాయాని ఆవేదన వ్యక్తం చేశారు. మండల విద్యాశాఖాధికారిగా ఉంటూ 'నా పైన కేసులు పెడతారు, నేను ఏమి చేయలేను, నాకు తెలియదు' అని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వాలను శాసించే పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, విద్యా వ్యవస్థలో కార్పొరేట్, ప్రయివేట్ వ్యవస్థలో మార్పులు తీసుకురావడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నది స్పష్టంగా అర్థమౌతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల బదిలీలతో బిజీగా ఉన్నామనే సాకుతో అన్నమయ్య జిల్లా విద్యా వ్యవస్థ గాడి తప్పుతోందన్నారు. జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల ఫీజులు, పాఠ్య పుస్తకాలు దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఎస్‌ఎఫ్ఐగా ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, ప్రేమ్ కుమార్, సుల్తాన్ పాల్గొన్నారు.


రైతుబజారు ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న ఎడిఎం, ఎఎంసి బృందం

రూ.26 లక్షలతో రైతుబజార్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

- జిల్లా వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ అధికారి త్యాగరాజు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో రైతు బజార్ ఏర్పాటుకు రూ.26 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు అన్నమయ్య జిల్లా వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ అధికారి త్యాగరాజు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఎడిఎం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామమూర్తి కలిసి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంతో పాటు వారపు సంత సమీప స్థలాలను రైతు బజారు ఏర్పాటు కోసం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తాము పండించిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ఇతర పంటలను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ వారికి అండగా నిలవాలన్నదే ప్రభుత్వ ధ్యేమన్నారు. పీలేరు మార్కెట్ కమిటీ పాలకవర్గం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డితో సంప్రదించి టమోటా మార్కెట్‌ను పునః ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని వారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రహంతుల్లా, వనిత, అనురాధ, ఖాదర్, సురేష్, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

అంతరించిపోతున్న ప్రకృతిని కాపాడాలి : జెవివి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అంతరించిపోతున్న ప్రకృతిని కాపాడాలని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కరపత్రాలు పంచిపెట్టి, అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కలుషితం కాకుండా కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జీవకోటికి ఆధారమైన పర్యావరణాన్ని కాపాడుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. మొక్కలు నాటడం ద్వారానే రేపటి తరాలకు ఆరోగ్యకరమైన ప్రకృతిని అందించగలుగుతామన్నారు. రవాణా, పరిశ్రమలు, వ్యర్థాలు ఇవన్నీ గాలి నాణ్యతపై ప్రభావం చూపిస్తాయన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కలు నాటాలని సూచించారు. అలాగే ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ రమేష్ బాబు, స్థానిక తరిగొండ రోడ్డులోని మైనార్టీ గురుకుల కళాశాలలో మదనపల్లి డిఎల్‌డిఒ అమరనాథ్ రెడ్డిలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, అధ్యాపకులు జాకబ్‌రవికుమార్, బాలగంగాధర్ తిలక్, నాగేశ్వర, వెంకటేశ్వర్లు, రెడ్డిజాన్సన్, ఎంపిడిఒ మనోహర్‌రాజు, ఎపిఒ సునీల్, ఇఒ రవీంద్రనాథ్, ఇఒఆర్‌డి సుధాకర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ చక్రపాణి, ఎంఎల్‌హెచ్‌పి అమృత, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ, సూపర్‌వైజర్ సుధాకర్, భానుబి, పంచాయతీ సెక్రటరీ జానకి, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు ప్రభుచరణ్

20 ఏళ్ల తరువాత మట్టిరోడ్డుకు మోక్షం

ప్రజాశక్తి-గాలివీడు


ఏర్పాటు చేసిన సిసి రోడ్డు

పట్టణంలోని ఎపి జిబి బ్యాంకు ఎదురు వీధిలో ఉన్న మట్టిరోడ్డుకు రోడ్డుకు 20 సంవత్సరాల తర్వాత మోక్షం లభించింది. గతంలో అభివృద్ధికి నోచుకోక మట్టి రోడ్డుపైనే ప్రజల జీవనం కొనసాగిస్తున్నారు. స్థానికులు, హర్ష స్కూల్ విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అరవీటివాండ్లపల్లి శ్రీనివాస్‌రెడ్డి చొరవ తీసుకుని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో మాట్లాడి రూ. 7 లక్షల నిధులు మంజూరు చేయించారు. సుమారు 135 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మించి గురువారం ప్రారంభించారు. స్థానికులు ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు రామాపురం మండల సమావేశం

ప్రజాశక్తి-రామాపురం : మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి గడికోట విజయలక్ష్మి అధ్యక్షతన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోని సభవనంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జాషువా ప్రకటనలో తెలియజేశారు. సమావేశంలో పంచాయతీరాజ్ శాఖలో చేసిన పనులపైనా, రెవెన్యూ, తాగునీరు, పారిశుధ్యం, గృహనిర్మాణశాఖ, ఆరోగ్యం, అంటువ్యాధులు, విద్య, వ్యవసాయం తదితర శాఖలపైనా సమీక్ష ఉంటుందన్నారు. సమావేశానికి జడ్‌పిటిసి, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సచివాలయ కార్యదర్శులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

పోలీసుస్టేషన్‌కు బారికేడ్లు వితరణ

ప్రజాశక్తి-రామాపురం

స్థానిక పోలీస్ స్టేషన్‌కు భారతి సిమెంట్ కంపెనీ ప్రతినిధులు బారికేడ్లను వితరణ ఇచ్చారు. భారతి సిమెంట్ కంపెనీ మార్కెటింగ్, మేనేజర్, ప్రతాపరెడ్డి గురువారం పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బారి కేడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా భారతీ సిమెంట్ ప్రతి సంవత్సరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, పోలీస్‌స్టేషన్‌కు బారికేడ్లను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.వి. సుధాకర్‌రెడ్డి, పోలీసులు భారతి సిమెంట్ కంపెనీ సిబ్బంది రమణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పాల్గొన్నారు.



బారికేడ్లు అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్ బాష

ప్రజల స్వేచ్ఛకు ఏడాది పూర్తి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్

ఎపి ప్రజల స్వేచ్ఛకు ఏడాది పూర్తయిందని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. గురువారం స్థానిక టిడిపి కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024, జూన్ 4 ల్యాండ్, శాండ్, వైన్, శాండిల్ ఉడ్‌కు విముక్తి దినమని, ప్రజల ఆస్తులకు హక్కులు కల్పించిన దినమని, ప్రజాస్వామ్యం పునరుద్ధరించిన దినమని పేర్కొన్నారు. వెన్నుపోటు పొడవడం వైసిపి నైజమని చెప్పారు. గత వైసిపి అరాచకాలు, కూటమి ప్రభుత్వ అభివృద్ధిపై మాట్లాడాలంటే వేదిక చెప్పండని సవాల్ విసిరారు. వైసిపి నాయకులు ప్రజలకు వెన్నుపోటు పొడిచి లక్షల కోట్లు ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. అవినీతిపరుల చరిత్ర ప్రభుత్వం వద్ద ఉందని, సమాజానికి పట్టిన చీడపురుగులు వైసిపి నాయకులని, మాట్లాడే నైతికత వారికి లేదని చెప్పారు. మదనపల్లె - చిత్తూరు మార్గంలో సుమారు 50 ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేసిన చరిత్ర వైసిపి నాయకులేదని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులకు తూట్లు పొడిచి పక్కదారి పట్టించలేదా, వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం చేయలేదా అని ప్రశ్నించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఒక్కరోజైనా సిఎంఒ నడిపారా, పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందించారా అని నిలదీశారు. రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో వైసిపి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడవడంతో అదే ప్రజలు ఓటు అనే బటన్ నొక్కి వైసిపికి గుణపాఠం చెప్పారన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు మోడెం సిద్ధప్ప, ఎస్.ఎం.రఫీ, రాటకొండ మధుబాబు, నవీన్ చౌదరి, బాలుస్వామి, రాధమ్మ, బైగారి భారతి నాయుడు, నాగూర్ వలి, జాన్ బాబు, నాదెళ్ల శివ, బాబా, డ్యాన్స్ రెడ్డెన్న పాల్గొన్నారు.

కలికిరి, కోడూరు తహశీల్దార్ల కృషి అభినందనీయం

ప్రజాశక్తి-రాయచోటి

కలికిరి, కోడూరు మండలాల తహశీల్దార్లు ప్రజల సమస్యల పరిష్కారానికి చూపిన కృషిని అభినందనీయమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో వారికి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడూరు మండలం చియ్యవరం గ్రామస్తులు, తమ గ్రామంలో 25 ఏళ్లుగా పరిష్కరించబడని దారి సమస్య గురించి తహశీల్దార్‌కు పిజిఆర్ఎస్‌లో అర్జీ ద్వారా విన్నవించుకోగా గ్రామస్తులతో మాట్లాడి సమస్యను శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించారని పేర్కొన్నారు. కరికిలి మండలం పారపట్ల గ్రామంలోని కురువపల్లెలో 20 సంవత్సరాలుగా ఉన్న దారి సమస్యను ఆ గ్రామస్తులు రెవెన్యూ సదస్సులలో అర్జీ ద్వారా విన్నవించుకోగా కలికిరి తహశీల్దార్ మహేశ్వరి బాయ్ ఈ దారి సమస్యను గ్రామస్తులతో మాట్లాడి శాంతియుతంగా చర్చల ద్వారా పరిష్కరించారని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం దొరకని దారి సమస్యలకు చర్చల ద్వారా పరిష్కారం చూపడం కోడూరు, కలికిరి మండలాల తహశీల్దార్ల నిబద్ధత మరియు సమాజం పట్ల అంకిత భావాలను తెలియజేస్తాయని కొని యాడారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు పాల్గొన్నారు.

తూకాలలో తేడాలొస్తే కఠిన చర్యలు : కలెక్టర్


వృద్ధ మహిళకు స్వయంగా సరుకులను అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-పుల్లంపేట

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చౌక దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీని సక్రమంగా నిర్వహించాలని, తూకాల్లో ఏమాత్రం తేడా వచ్చినా ఒక్క గ్రాము తగ్గినా కూడా చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులకు సూచించారు. గురువారం ఉదయం పుల్లంపేట మండలం ఎగువరెడ్డిపల్లి 8ఎ చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి నిత్యావసర వస్తువుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా చౌక దుకాణం ఏఏ సమయాల్లో నిర్వహిస్తున్నారు, ఆ దుకాణం పరిధిలో ఎంతమంది లబ్ధిదారులు ఉన్నారు, ఎంతమందికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు, 65 ఏళు పైబడిన వృద్ధులు ఎంతమంది ఉన్నారు, ఎంతమందికి ఇంటింటికి డోర్ డెలివరీ చేశారు తదితర వివరాలను కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయాలలో ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా చౌక దుఃఖనాన్ని నిర్వహిస్తు న్నామని, ఆ చౌక దుకాణం పరిధిలో 65 ఏళ్ల పైబడిన వృద్ధులు 37 మంది ఉన్నట్లు తహశీల్దార్ అరవింద కిషోర్ కలెక్టర్‌కు వివరించారు. వస్తువుల పంపిణీ సందర్భంగా తూకంలో ఏ మాత్రం తేడా రాకూడదని, లబ్ధిదారుకు ఒక్క గ్రాము తక్కువ ఇచ్చినా కూడా తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని, 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దకే తప్పనిసరిగా నిత్యావసర వస్తువులను డోర్ డెలివరీ చేయాలని చౌక దుకాణం డీలర్‌కు కలెక్టర్ సూచించారు. అనంతరం ఆ చౌక దుకాణం పరిధిలోని అనంతంపల్లిలో నివసించే 65 ఏళ్ల వయసు పైబడిన కె.వెంకట సుబ్బమ్మ లబ్ధిదారు ఇంటికి వెళ్లి బియ్యం, చక్కెర వస్తువులను స్వయంగా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అందజేశారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ నదియాదేవి, తహశీల్దార్ అరవింద కిషోర్, ఆర్ఐ సుశీల్ కుమార్, విఆర్ఒ రాధమ్మ పాల్గొన్నారు.

తిప్పాయపల్లె కార్యదర్శి సస్పెన్షన్ : మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో చెత్త నుండి సంపద సృష్టి తయారు కేంద్రాన్ని గురువారం ఉదయం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో ఎన్ని గృహాలు ఉన్నాయి, ఎంతమంది చెత్త కలెక్ట్ చేస్తున్నారు, రోజూ ఎంత చెత్త వస్తుంది, సేకరించిన చెత్తను ఎక్కడ డంప్ చేస్తున్నారు, సెగ్రిగేషన్ చేస్తున్నారా, ఎంత మంది నుంచి చెత్త సేకరించారు, ఎక్కడ డంప్ చేశారని పంచాయతీ సెక్రెటరీ గంగాధర్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ సెక్రటరీ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో పాటు చెత్త కూడా సేకరించలేదని కలెక్టర్ పరిశీలనలో వెల్లడైంది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, స్వయంగా కూడా పంచాయతీ సెక్రటరీలకు ఇంటింటి చెత్త సేకరణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కూడా విధులలో అతను పూర్తి నిర్లక్ష్యం వహించడంతో వెంటనే సస్పెండ్ చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. తగిన పర్యవేక్షణ చేయకపోవడంతో తిప్పాయపల్లె ఇఒపిఆర్‌డి ముత్తయ్యకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎంపిడిఒకు సూచించారు. గ్రామ పంచాయతీలలో ప్రతిరోజు ఇంటింటి నుంచి తడి పొడి చెత్త సేకరణ తప్పనిసరిగా చేయాలని, సేకరించిన చెత్తను సెగ్రిగెషన్ చేయాలన్నారు. విధులలో నిర్లక్ష్యం వహించిన వారిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరవింద కిషోర్, ఎంపిడిఒ జయశ్రీ, మండల సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ అమర్‌నాథ్‌రెడ్డి

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

- డిఎల్‌డిఒ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన తప్పక పాటించాలని మదనపల్లె డివిజన్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీసర్ (డిఎల్‌డిఒ) అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని ముష్టూరు గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు రిజిస్టర్‌లను, పలు రికార్డులను, సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో సమయానికి హాజరు వేయాలన్నారు. గ్రామ సచివాలయాల్లో వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పనిచేస్తున్నారని, ప్రతి ఉద్యోగి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించాలని ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని పేర్కొన్నారు. ప్రతి నెల ఒకటవ తేదీన ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లను ఉదయం ఏడు గంటల నుంచి పంపిణీ చేయాలని తెలిపారు. ఏ క్షణమైనా ఉన్నతాధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ గ్రామ సచివాలయాలను సందర్శించే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు విధిగా తమ విధులను నిర్వర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలలో పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం రెడ్డివారిపల్లి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలను నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గాయత్రి, లోకేశ్వరి, ఇన్‌ఛార్జి పిఆర్ఎఇ తిరుమలేష్, వరప్రసాద్, ఎఎన్ఎం అభిదా, మీనాక్షి, అనిత భాయి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి గ్రంథాలయ విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి -కలకడ

వేసవి గ్రంథాలయ విజ్ఞాన శిబిరం ముగిసినట్లు కలకడ గ్రంథాలయ శాఖ అధికారి అమరనాథ్ తెలిపారు. గురువారం స్థానిక గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను ఈ వేసవి కాలం సెలవులలో ప్రతి విద్యార్థి వినియోగించుకున్నారన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల ద్వారా విద్యార్థులలో తెలివితేటలు పెరగడం సృజనాత్మకత శక్తి పెంచుకున్నారని పేర్కొన్నారు. అనంతరం గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేసిన తెలిపారు.కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



సంఘ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

మెరుగైన జీవనోపాదులు పొందాలి

ప్రజాశక్తి- వీరబల్లి

సంఘ సభ్యులకు మెరుగైన జీవనోపాదుల కల్పనే లక్ష్యంగా పనిచేయాలని వెలుగు ఎపిఎం ఖాదర్‌వలి కోరారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సమాఖ్యల సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘం సమావేశంలో కచ్చితమైన జీవనోపాదుల ఏర్పాటుపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సభ్యులందరితో జీవనోపాదుల ప్రణాళికలు కచ్చితంగా ఆన్‌లైన్‌లో చూపించాలని తెలిపారు. ప్రతి సభ్యురాలు బయోమెట్రిక్ ఎఫ్ ఆర్ఎస్ నమోదు చేసినప్పుడే ప్రభుత్వం కల్పించే రాయితీలు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ అవుతాయన్నారు. సంఘాల సమావేశాలు పుస్తక నిర్వహణ, ప్రతినెల నిర్వహించినప్పుడే మంచి గ్రేడ్ వస్తుంది అన్నారు. రాయచోటి గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రమాదేవి మాట్లాడుతూ సంఘం బాధ్యతలు సభ్యులందరూ చేసేటట్లు చూడాలని కోరారు. క్రమం తప్పని పొదుపులు, రుణాల చెల్లింపులు ఉండాలని కోరారు అర్హత గల సంఘాలకు వెంటనే రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలపారు. కార్యక్రమంలో సిసిలు కృష్ణయ్య, గంగాధర్, నాగేంద్ర, విఒఎలు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి-కలికిరి

రైతులకు లాభసాటి వ్యవసాయంలో మెలకువలను గురించి కెవికే కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం గుండ్లూరులో ఏర్పాటు చేశారు. గురువారం కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి సమన్వయకర్త డాక్టర్ కె.మంజుల పర్యవేక్షణలో గుండ్లూరు గ్రామంలో ఏడవ రోజు వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్తగా విచ్చేసిన డాక్టర్ దేవకి మాట్లాడుతూ వరిలో తెగుళ్ళ యాజమాన్యం గురించి, వేరుశనగలో విత్తన శుద్ధి గురించి, టమోటాలో సమగ్ర పోషక యాజమాన్యం గురించి వివరించారు. తదుపరి డాక్టర్ గిరినాథ్ మాట్లాడుతూ పాడి రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అయినటువంటి పశు భీమా, మిని గోకులం, ఎన్ఎల్ఎం, దాణా కొనుగోలు సంబంధించిన పథకాల గురించి తెలియజేశారు. ఆత్మ, బిటిఎం అమృత్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధిత రంగాలలో ఆత్మ వారు అందజేస్తున్న సేవల గురించి తెలియజేస్తూ వేరుశనగ పంటతో పాటు కందిని మిశ్రమ పంటగా సాగు చేయాలని రైతులను ప్రోత్సహించారు. చివరగా డాక్టర్ కె నవీన కె.వి.కె. పశు వైద్య శాస్త్రవేత్త మాట్లాడుతూ కెవికె ముఖ్య ఉద్దేశాల గురించి, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ ముఖ్య ధ్యేయలను తెలియజేస్తూ పాడి రైతుల సమస్యలకు సమాధానాలు తెలియజేశారు. చివరగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందరేగా రైతుల చేత మొక్కలు నాటించారు.

ఉచితంగా వెదురు టూత్ బ్రష్‌లు పంపిణీ

ప్రజాశక్తి-రాయచోటి

గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ ఉత్పత్తుల స్థానంలో వెదురు ఉత్పత్తులు వాడి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెదురు వృత్తి దారులు సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఎన్‌జిఒ ప్రధాన కార్యదర్శి గుజపనేని రెడ్డయ్య పేర్కొన్నారు. వెదురు టూత్ బ్రష్‌లను ఉచితంగా ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ కార్యాలయాలలోని ఉద్యోగులకు వెదురు వృత్తిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రెడ్డయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ ఉత్పత్తులు స్థానంలో పర్యావరణ పరిరక్షణ కు దోహదపడే వెదురు ఉత్పత్తులు వాడాలనారు. వర్షాకాలంలో మొక్కలు నాటే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ ట్రీగార్డ్‌ల స్థానంలో వెదురు ట్రీగార్డ్‌లు వాడాడలన్నారు.



వృత్తిదారులకు బ్రష్‌లు పంపిణీ చేస్తున్న రెడ్డయ్య

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-పుల్లంపేట

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ శ్రీధర్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల పరిధిలోని శ్రీరంగరాజుపాలెంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లే మన భవిష్యత్‌కు బాసట. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి ఒక్కరూ ఒక్క మొక్కనైనా నాటి, పెంచాలన్నారు. మన భూమిని రాబోయే తరాలకు ఆరోగ్యంగా అందించాలంటే ఇది ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రపంచం నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించడమే ఈ రోజు కార్యక్రమ ప్రధాన లక్ష్యంగా మేము తీసుకున్నామని, ప్లాస్టిక్ వినియోగం పట్ల ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ రాజేంద్రన్, జిల్లా అటవీ అధికారి జగన్నాథ్ సింగ్, రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి, సబ్ డిఎఫ్ఒలు సుబ్బరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని తహశీల్దార్ అమర్నాథ్, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తహశీల్దార్, ముష్టూరులో ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, ఎపిఒ రమేష్ మొక్కలు నాటారు.కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్ పాల్గొన్నారు. **కలకడ:** మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ తహశీల్దార్ ఫణి కుమార్, ఎంపిడిఒ అబ్దుల్ రహీం అన్నారు. తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ప్రతాపరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా, టైపిస్టు శివ సాయి గణేష్, హౌసింగ్ ఏఈ నాగ ముని నాయక్, సిబ్బంది చంద్ర నాయక్ పాల్గొన్నారు. **కలికిరి:** మొక్కలు పెంచితేనే పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని ఎంపిడిఒ భానుమూర్తి రావు అన్నారు. మండలంలోని ఐటిబిపి నగిరిపల్లిలో 2700 మొక్కలు నాటారు. **బి.కొత్తకోట :** మొక్కలే మానవాళి మనుగడకు ఆధారమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటే కార్యక్రమంలో డాక్టర్ ఆరీఫుల్లా, డాక్టర్ వెంకట్రామయ్య, డాక్టర్ హసీనా పర్వీన్, డాక్టర్ దుర్గాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **రాయచోటి:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు తోడ్పాటు అందించాలని నియోజకవర్గం టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని గొర్లముదివీడు, చెర్లోపల్లి గ్రామంలో లక్ష్మీప్రసాద్‌రెడ్డి మొక్కలు నాటారు. **రామాపురం :** మండల వ్యాప్తంగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ఉపాధి ఎపిఒ పెంచలయ్య పేర్కొన్నారు. మండలంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన ఫారం ఫాండ్స్ పనుల్లో భాగంగా నీటి సౌకర్యం ఉన్న 52 చోట్ల మొక్కలు నాటారు. రాచపల్లి పంచాయతీలోని యుపి స్కూల్ ఆవరణంలో ఫారెస్ట్ అధికారులు వంగిమల ఫారెస్ట్ సెక్షన్ అధికారి భరణి కుమార్ ఆధ్వర్యంలో గ్రామ టిడిపి నాయకులతో కలసి మొక్కలు నాటించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది, రాచపల్లి, టిడిపి గ్రామ నాయకులు పాల్గొన్నారు. **వీరబల్లి :** పర్యావరణాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని ఎంపిపి రాజేంద్ర నాథ్‌రెడ్డి, ఎంపిడిఒ నూర్జహాన్, ఇఒపిఆర్‌డి రామచంద్ర రెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండలంలోని కెజిబివి స్కూల్ ముందు, ఎంపిడిఒ కార్యాలయంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు అంతా సహకరించాలని పిలుపునిచ్చారు. మండలంలో అక్కడక్కడ విఎస్ఎస్ సభ్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎపిఒ చంద్రకళ, హౌసింగ్ ఎఇ వెంకటేష్,. ఇసి ఆంజనేయులు, ప్రజలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ తెలిపారు. గురువారం ఫోర్డ్ సంస్థ, క్రైం సంస్థలు సంయుక్తంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాన్ని మదనపల్లెలో రెండు రోజులు నిర్వహించారు. మదనపల్లిలో టిఎస్ఆర్ కాలనీ, బుగ్గకాలువ, బసినికొండ కాలనీలలో బాలల సంఘం పిల్లలచే మొక్కలు నాటించి, వాటి అవశ్యకత పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. పంటలు, మార్కెటింగ్ విషయాలపై అవగాహన కల్పించి చైతన్య పరిచారు.కార్యక్రమంలో నేతాజీ బాలల సంఘం, గాంధీజీ బాలల సంఘం పిల్లలు, ఫోర్డ్ సిబ్బంది నరసింహ, జయలక్ష్మి, స్వర్ణ, జలజ, అల్తాఫ్ కమ్యూనిటీ ప్రజలు పాల్గొన్నారు. **ప్రభుత్వ జూనియర్ కళాశాలలో** ఎన్‌సిఇసఆఫీసర్ సేగు రెడ్డప్పరెడ్డి ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ గోపతి బాలకృష్ణమూర్తి అధ్యక్షతన మొక్కలు నాటారు. ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ రామలింగారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ బాబు, డీన్ అకడమిక్స్ డాక్టర్ వివిఎన్ భాస్కర్, హెచ్ఒడీ లు అమ్రనాథ్ రెడ్డి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు. **గాలివీడు** : కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరు మొక్కలునాటాలని ఎంపిడిఒ సి.ఎ. జవహర్‌బాబు పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పార్మఫాండ్ బండ్ మీద మొక్కలు నాటి అందరం ఆరోగ్యాంగా ఉండాలంటే చల్లని గాలి అవసరం అని అందుకు మొక్కలు నాటాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఒ రామచంద్ర, టిఎ నరేంద్ర, ఎస్.ఎ.అక్బర్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **పీలేరు :** పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ స్థలాలు, సినిమా థియేటర్ల పరిశీలన కోసం గురువారం పీలేరుకు వచ్చిన ఆయన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక తహశీల్దారు కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహశీల్దారు భీమేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక తిరుపతి రోడ్డులోని ఎపిఎస్‌పిడిసిఎల్ డివిజన్ కార్యాలయం ఆవరణంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, డిఇ అమీర్‌బాష, పట్టణ ఎఇ ఖాదర్ ఇలాహి, సిబ్బంది కూడా మొక్కలు నాటారు. పీలేరు అటవీ శాఖ అధికారి సబీహా సుల్తానా ఆధ్వర్యంలో మండలంలోని మేళ్లచెరువు గ్రామంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్ వినియోగాలు మానాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



పుల్లంపేట : మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, కలెక్టర్, జెసి

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

ప్రజాశక్తి- రామాపురం

జిల్లాలోని పలు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రతిభా అవార్డులను ప్రకటించారు. కలెక్టర్ చేతుల మీదుగా అందించే ప్రతిభ అవార్డుకు రామాపురం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థి తరుణ్ కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ వరప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 -25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి మెరిట్ మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ నెల 9న విద్య శాఖ వారు కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభ అవార్డు అందజేస్తారని ఆయన పేర్కొన్నారు.



తరుణ్‌కుమార్

కలికిరి: ఆదిస్ ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి కె.గోవర్ధన్ రెడ్డి ప్రతిభ అవార్డుకు ఎంపిక అయ్యారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో క్లాసు పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 587/600 మార్కులతో కలికిరి మండలంలో రెండవ ర్యాంక్ సాధించిన ఈ విద్యార్థికి ప్రతిభ అవార్డు లభించింది. ఇతను సదుం మండలం పాలమంద మిట్టపల్లి కు చెందిన రైతు రెడ్డిశేఖర్ రెడ్డి భ్రమరాంబల కుమారుడు. ఇతనికి ప్రతిభ అవార్డు రావడం పట్ల డైరెక్టర్ ఆదినారాయణ రెడ్డి, కరస్పాండెంట్ సుజాత మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.



గోవర్ధన్‌రెడ్డి

రైల్వేకోడూరు: పట్టణంలోని శ్రీ షిరిడి సాయి జూనియర్ కళాశాలలో చదువుతున్న బి.మీనా కుమారి ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ ఏ చంగల్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ బోర్డు ప్రతిభ అవార్డులను ప్రకటించిందని అందులో మా కళాశాలలో సిఇసి ఇంగ్లీష్ మీడియంలో మీనా కుమారి 931/1000 మార్కులు సాధించి ప్రతిభ అవార్డుకు ఎంపికైందని ఆయన తెలిపారు. అవార్డు సాధించిన విద్యార్థిని ప్రిన్సిపాల్ తో పాటు కళాశాల డైరెక్టర్లు వెంకటరత్నం, రవి కుమార్రాజు, రెడ్డయ్య నాయుడు, కోటేశ్వరరావు అధ్యాపక బృందం అభినందించారు.

విక్టరీ విద్యార్థులకు ప్రతిభా అవార్డులు : పట్టణంలోని విక్టరీ హైస్కూల్ లో చదివిన విద్యార్థులు చరితార్థని, వైష్ణవి ప్రతిభ అవార్డులు సాధించారని పాఠశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో రాష్ట్ర స్థాయిలో 595 మార్కులు సాధించిన చరితార్థని, 591 మార్కులు సాధించిన వైష్ణవికి ప్రతిభ అవార్డులు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం అవార్డు సాధించిన విద్యార్థులను అభినందించారు.



బి.మీనాకుమారి



చరితార్థని



వైష్ణవి



ఆర్‌ఒబి రోడ్డు విస్తరణ పనుల కోసం స్థల పరిశీలన చేస్తున్న ఆర్‌డిఒ

పీలేరులో ఆర్‌డిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-పీలేరు

రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్ పీలేరు మండలంలో పలుచోట్ల ఆకస్మిక తనిఖీలు చేశారు. గురువారం మండలంలోని గుడరేవుపల్లిలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. స్థానిక తిరుపతి రోడ్డులో ఏపీ టూరిజం శాఖ నిర్మాణాల కోసం స్థల పరిశీలన చేశారు. అదేవిధంగా పట్టణంలోని జివిసిఎస్‌ఆర్ సినిమా థియేటర్ లో సౌకర్యాలపై ఆకస్మిక తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. చివరిగా ఆర్‌ఒబి నిర్మాణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మదనపల్లి మార్గంలో ఉన్న రైల్వే గేటు వద్ద రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన సమస్యలను పరిశీలించి తగిన ఆదేశాలను జారీ చేశారు. కార్యక్రమంలో పీలేరు తహశీల్దారు భీమేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులు, వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

మిండిగళ్లు లక్ష్మణ్, శ్రావణిల కుమారుడు దేవాన్ష్ రాజు పుట్టినరోజుని పురస్కరించుకొని గురువారం బెంగుళూరు నగరంలోని శబరి ఆశ్రమంలో ఉన్న 100 మంది వృద్ధులు, చిన్నపిల్లలకు యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షులు తగాది రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అన్నదానాలలోకెల్లా అన్నదానం గొప్పదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పుట్టినరోజు ఇతర శుభకార్యాలను నిరాడంబరంగా జరుపుకొని అందుకు వెచ్చించే ఖర్చును సేవా కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు. ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్, రాజారెడ్డి, శ్రీనివాసులు, ఆదర్శ, అనిల్, మధు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా ఎపి ఫైబర్ నెట్ సేవలు

- అసౌకర్యంగా ఉందని వాపోతున్న వినియోగదారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండల వ్యాప్తంగా ఎపి ఫైబర్ నెట్ సేవలు అస్తవ్యస్తంగా మారాయి. వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు నాణ్యమైన నెట్(డేటా) సౌకర్యంతోపాటు టెలివిజన్ వినోదానికి ఎపి ఫైబర్ నెట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇటీవల కాలంలో ఎపి ఫైబర్ నెట్ ద్వారా నెట్(డేటా) సక్రమంగా రాకపోవడంతోపాటు టీవీలలో తరచూ అంతరాయం కలుగుతోందని తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపో తున్నారు. బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా తరచూ అంతరాయం ఏమిటని విని యోగదారులు ప్రశ్నిస్తున్నారు. కొన్ని గ్రామాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధికంగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై స్థానిక కేబుల్ ఆపరేటర్లను సంప్రదించినప్పటికీ ఏమాత్రం స్పందించడం లేదని విని యోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని ఎపి ఫైబర్ నెట్ సేవలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఏనుగుల దాడి నుంచి ప్రజలను కాపాడండి

ప్రజాశక్తి - వేంపల్లె

ఏనుగుల దాడి నుంచి ప్రజలను, రైతులను కాపాడాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కాలంలో రాష్ట్రంలో ఏనుగుల భీభత్సం ఎక్కువైందన్నారు. ఏనుగుల వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పో తున్నారని తెలిపారు. పంట నష్టం ఎక్కువగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణాన్ని పరిరక్షించు కోవడం మనందరి ప్రథమ కర్తవ్యమన్నారు.

10 నుంచి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జెవివి రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జెవివి ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. ఆ మేరకు గురువారం కార్యాలయంలో గోడపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత శిక్షణకు రాదలిచినవారు 97053 33305కు ఫోన్ చేసి పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. అనుభవజ్ఞులైన టీచింగ్ ఫ్యాకల్టీతో శిక్షణ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జెవివి ఉపాధ్యక్షులు వేంపల్లి రాజశేఖర్, అనంతకృష్ణ, అంజిరెడ్డి, గాయత్రి, హరి కేశవ్, భువన్, హైమావతి పాల్గొన్నారు



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒ రామచంద్రారెడ్డి

నాణ్యమైన భోజనం అందించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి- కలకడ

నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులు అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఎంఇఒ-2 రామచంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాలలో మిడ్ డే మీల్స్ ఏజెన్సీ వారితో నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు పౌష్టికాహారమైన ఆహారాన్ని అందించాలని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విజయవాడలో శిక్షణ పొందిన సయ్యద్ రిజ్వానా మిడ్ మీల్స్ ఏజెన్సీ వారికి శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. విద్యార్థులకు తగిన రీతిలో నాణ్యమైన భోజనం అందించడానికి చొరవ చూపాలన ఉద్దేశంతో ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మలం షావలి, మిడ్ డే మీల్స్ ఏజెన్సీ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అనంతరాజు

వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి - వీరబల్లి

మండలంలోని మట్లి, పెద్దివీడు, వీరబల్లి పంచాయతీల్లో వ్యవసాయ శాఖ అధికారి స్వాతి ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు వారు వికసిత కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం నిర్వహిచిన కార్యక్రమానికి డాక్టర్ ముకుంద లక్ష్మి, ఉద్యాన కళాశాల అధ్యాపకులు అనంతరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, రైతు సంక్షేమాన్ని బలోపేతం చేయడం ప్రజలకు తెలియజేశారు. మామిడి తోటలో అంతర పంటలైన పసుపు, అల్లం, సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. ఒక్క సంవత్సరంలో రెండుసార్లు కాపుకు వచ్చే రాయల్ స్పెషల్ పునాస మామిడి మొక్కలు నాటితే మంచి ఫలితాలు ఇస్తాయన్నారు. భారత నూనె గింజల పరిశోధన సంస్థ డాక్టర్ హెచ్.పి మీనా మాట్లాడుతూ రైతులు విత్తనం వేసి అమ్మడం కాదు, దానికి విలువ జోడింపు చేసి అమ్మితే మంచి ఫలితాలు ఉంటాయని తెలిపారు. వేరుశనగ గింజలతో చిక్కీలు చేయడం, నూనె తయారు చేయడం, విత్తనోత్పత్తి తయారు చేయడం ద్వారా నాలుగు ఐదు రెట్లు అధిక లాభాలు వస్తాయని తెలిపారు. వ్యవసాయ పద్ధతులు, తెగులు నిర్వహణ, జీవామృతం, ఘన జీవామృతం వంటి సహజ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. డాక్టర్ శిల్పకళ కెవికె శాస్త్రవేత్త మాట్లాడుతూ వేరుశనగలో కొత్త రకాలైన టీ చి ఏ ఎస్- 169ఎం, కె. 1812, గిరినార్-4,5, రకాలు అలాగే కందిలో ఎల్ఆర్ జి,105, వంటి కొత్త రకాలు సాగు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి స్వాతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు అందించే పథకాలు గురించి డ్రోన్ పైన ఇచ్చే సబ్సిడీ గురించి వివరించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, వందమంది రైతులు పాల్గొన్నారు.

మెనూ తప్పక పాటించాలి : ఎంఇఒ

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న వంట ఏజెన్సీలకు మరియు ప్రధానో పాధ్యాయులకు ఎంఇఒ నాగ తిరుమల రావు స్థానిక ఎస్‌బివిడి సభ పాఠశాల యందు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కొత్త మెనూ ప్రకారం డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం చేయాలని తెలిపారు. ఏ పాఠశాలలో అయితే మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించరో ఆ పాఠశాల ఏజెన్సీ, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థుల హాజరు పట్టిక ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని తెలియజేశారు. రేషన్ షాప్‌లో విద్యార్థులకు ఇచ్చే బియ్యం వేరుగా ఉంటాయని చెప్పారు. అవి మాత్రమే తీసుకోవాలని పేర్కొన్నారు. మన ఇంట్లో ఎలా భోజనం చేసుకుంటామో అదేవిధంగా విద్యార్థులకు కూడా రుచికరమైన భోజనం పెట్టాలని తెలిపారు. ఉన్నతాధికారులు పరిరక్షించినప్పుడు విద్యార్థుల నుంచి ఎటువంటి కంప్లైంట్స్ వచ్చినా తక్షణమే కొంత ఏజెన్సీ వారిని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వంటల పోటీలు నిర్వహించి గెలుపొందిన మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ బి వి డి సభ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మురళి, అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎంఐఎస్ శివ, సిఆర్‌పిలు, ఐఇఆర్‌టి విజయ కుమారి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వంట ఏజెన్సీ వారు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, కొత్తపల్లి పంచాయతీ, కొత్తిండ్లుకు చెందిన కొండయ్య కుమారుడు హరిప్రసాద్ (32) ఎలక్ట్రిషియన్‌గా పని చేసుకుంటూ జీవనం చేస్తున్నాడు. ఇతనికి భార్య నాగవేణి, రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కొంతకాలంగా హరిప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ వారం రోజుల కిందట భార్యను, కుమారుడిని అతని అత్తగారిల్లు బోయపల్లిలో వదిలి వచ్చాడు. అప్పటినుంచి తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తాలూకా పోలీసులు తెలిపారు.



మృతుడు హరిప్రసాద్ (ఫైల్)

హోటల్‌లో పేలిన గ్యాస్ సిలిండర్

- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని ఓ హోటల్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం పట్టణంలో జరిగింది. రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక చెన్నై-ముంబయి జాతీయ రహదారికి అనుకుని నీరుగట్టువారిపల్లి సమీపం బాక్స్ బిర్యానీ సెంటర్ నడుస్తోంది. ఈ బిర్యాని సెంటర్లో సిలిండర్ నుంచి గ్యాస్ స్టవ్‌కు వెళ్లే పైపు ద్వారా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించి సిలిండర్ పేలింది. ఈ ప్రమాదంలో హోటల్లో ఉన్న రామ్మోహన్ (38) సురేంద్ర (35) మున్నెమ్మ (42) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే మంటలను అదుపుచేసి బాధితులను స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాధితులను ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.